క్లుప్తంగా

దంతాల పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలి



రేపల్లె రూరల్: ప్రతి ఒక్కరూ తమ దంతాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని దంత వైద్య నిపుణులు ఆరతి భూషణ్ అన్నారు. ప్రపంచ దంత దినోత్సవం సందర్భంగా పట్టణంలో ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నోటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దంతాలకు సంబంధించి ఏ సమస్య తలెత్తినా వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స పొందాలన్నారు. పొగాకు, ఖైనీ వంటివి తీసుకుంటే నోటి క్యాన్సర్‌కు గురి కావాల్సి వస్తుందన్నారు. చిన్నపిల్లల్లో సైతం 70 శాతం మంది ఏదో ఒక రకమైన దంత సమస్యలతో బాధపడుతున్నారని, ప్రతి ఆరు నెలలకు ఒకసారి దంత పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సుధాకర్, వైద్యాధికారులు పృథ్వి, శ్వేత, స్వప్న, జీవన్, శివన్నారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీ కొని వ్యక్తి మృతి



చెరుకుపల్లి: ద్విచక్ర వాహనం సైకిల్‌ను ఢీ కొట్టడంతో పగడల శ్రీనివాసరెడ్డి(46) బుధవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం చెరుకుపల్లి మండలంలోని పగడలవారి పాలెం గ్రామానికి చెందిన శ్రీనివాస రెడ్డి సైకిల్‌పై కోటిరెడ్డి పాలెం వెళ్లి తిరిగి పగడలవారి పాలెం వస్తుండగా, వెంకటేశ్వర రెడ్డి ద్విచక్ర వాహనంపై అతి వేగంతో వెంకటరెడ్డి పాలెం వద్ద సైకిల్ ఢీ కొట్టడంతో శ్రీనివాసరరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించడం జరిగిందని ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పగడల శ్రీనివాసరెడ్డి కుమారుడు సాంబిరెడ్డి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

నేడు ఉచిత గుండె వైద్య శిబిరం

నిజాంపట్నం: మండలంలోని ఆముదాలపల్లి గ్రామ సచివాలయం వద్ద ఈ నెల 3వ తేదీన గురువారం ఉదయం 9 గంటలకు ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించబడునని జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ హెల్ప్ హాస్పిటల్ వారు నిర్వహించే వైద్య శిబిరంలో ఆయాసం, గుండె దడ, గుండె నొప్పి, గుండె బరువుగా ఉండటం, తల తిరగటం, ఎడమ చేయి లాగటం, ఎక్కువ కాలంగా బీపీ, షుగర్ ఉన్న వారికి ఎంతో ఖరీదైన గుండె స్కానింగ్ పరీక్షలు, ఈసీజీ, టూడీ ఎకో పరీక్షలు ఉచితంగా చేయబడునని తెలిపారు. ఆముదాలపల్లి, పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

తెనాలిరూరల్: లాడ్జీల నిర్వాహకులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు సూచించారు. తెనాలి త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లాడ్జీలు, హోటళ్ల నిర్వాహకులతో బుధవారం రాత్రి ఆయన సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. లాడ్జిలకు వచ్చే వారు అనుమానాస్పదంగా ఉంటే వెంటనే ఖచ్చితంగా పోలీసులకు సమాచారమివ్వాలని, గదులు అద్దెకు తీసుకునే వారి నుండి తప్పనిసరిగా ఆధార్ కార్డు/పాన్ కార్డు/డ్రైవింగ్ లైసెన్స్ వంటి ఐడీ కార్డులను తీసుకుని సమాచారాన్ని రికార్డు చేయాలన్నారు. మైనర్లకు గదులు ఇవ్వాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. క్రమం తప్పకుండా డైలీ రిజిస్టర్ మెయింటెయిన్ చేయాలని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండ లాడ్జిల నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని, బెట్టింగ్, జూదం, వ్యభిచారం నిర్వహించే వారు గదులను అద్దెకు తీసుకుని పట్టుబడితే నిర్వాహకులపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రీ సర్వేపై అవగాహన ర్యాలీ



తెనాలిరూరల్: మండల పరిధిలోని పెదరావూరు గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ రీ సర్వేతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఒకే సర్వే నంబరులో వేరువేరుగా ఉన్న భూములకు ఒకే నెంబర్ పై ల్యాండ్ పార్సెల్ మ్యాప్ ఇవ్వటం జరుగుతుందని చెప్పారు. అలాగే హద్దులు, విస్తీర్ణం, యాజమాన్య హక్కులు స్పష్టంగా పొందుపరచడం జరుగుతుందన్నారు. రైతులు, గ్రామస్తులు రీ సర్వే ప్రక్రియకు సహకరించాల్సిందిగా ఆయన కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా రెవెన్యూ గెస్ట్‌హౌస్

- బూత్ బంగ్లాను తలపిస్తున్న రెవెన్యూ భవనం
- భవనం ఆవరణలో విష పురుగుల సంచారం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం



అధ్వాన స్థితిలో తహసీల్దార్ కార్యాలయ గెస్ట్‌హౌస్

రేపల్లె రూరల్: పట్టణంలోని రెవెన్యూ గెస్ట్ హౌస్ నిరుపయోగంగా ఉంది. సంవత్సరాల నుంచి ఏ అధికారి పట్టించుకోకపోవటంతో గెస్ట్ హౌస్ చుట్టూ పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగి బూత్‌బంగ్లాను తలపిస్తోంది. దీంతో పాటు కార్యాలయంపై పర్యవేక్షణ కొరవడటంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. భవనంకు మరమ్మతులు నిర్వహించి వినియోగంలోకి తెస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రజా సంఘాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. రేపల్లెకు రెవెన్యూ డివిజన్ హోదా వచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్నా పలు ప్రభుత్వ కార్యాలయాలు నేటికీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఉన్న వాటిని వినియోగించుకుంటే అటు ఉద్యోగులకు, కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. తాలూకా ప్రాంగణంలోని విశాలమైన మైదానంలో ఉన్న రెవెన్యూ గెస్ట్ హౌస్‌ను అభివృద్ధి చేసుకుని వినియోగంలోకి తెస్తే ఇరిగేషన్ గెస్ట్‌హౌస్‌లో ఇరుకు గదులలో కొనసాగుతున్న రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పరుచుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్యాలయాన్ని అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

21 కార్యాలయాలు ఒకేచోట

రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా రేపల్లె పట్టణంలోని తాలూకా ప్రాంగణంలో 21 ప్రభుత్వ కార్యాలయాలు ఒక్కచోటే ఉండటం విశేషం. వివిధ పనులపై రేపల్లెకు వచ్చే ప్రజలకు కార్యాలయాలన్నీ ఒకే ప్రాంగణంలో ఉండటంతో వారు తమ పనులను పూర్తి చేసుకునేందుకు సులువుగా ఉంటుంది. అయితే వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు కూతవేటు దూరంలో తాలూకా కార్యాలయ ఆవరణలోని రెవెన్యూ గెస్ట్ హౌస్ బూత్ బంగ్లాను తలపిస్తోంది. అధికారులకు వసతి గృహంగా నిర్మించబడిన గెస్ట్‌హౌస్‌ను రెవెన్యూకు చెందిన ఏ అధికారి పట్టించుకోకపోవటంతో పిచ్చి చెట్లు ఏపుగా పెరిగి చిట్టడవిని తలపిస్తూ విష పురుగుల సంచారానికి అనువుగా మారింది. రాత్రి సమయంలో తాలూకా ప్రాంగణంలో నిఘా కొరవడటంతో మందు బాబులకు మాత్రం ఈ గెస్ట్‌హౌస్ అడ్డాగా మారుతోంది. అయితే గెస్ట్‌హౌస్ సమీపంలో పోలీసు సర్కిల్ కార్యాలయం, సబ్‌కోర్టు, సీడీపీవో కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం, సహాయ సాంఘిక సంక్షేమ శాఖాధికారి కార్యాలయాలు ఉండటంతో నిత్యం వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వివిధ పనులపై వస్తుంటారు. పగటి సమయంలో కార్యాలయాలకు వచ్చే ప్రజలు కాసేపు సేదతీరేందుకు ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన బల్లలపై కూర్చునేందుకు వచ్చిన వీరికి తాగి పడేసిన మందు సీసాలే కాకుండా విష పురుగులు సైతం దర్శనమిస్తుండటంతో ఆందోళనకు గురవ్వాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. గతంలో ఒక ఆవు ఇటుగా వచ్చి పాము కాటుకు గురై మృతి చెందిన ఘటన అందరికి తెలిసిందే. ఇప్పటికైనా అధికారులు స్పందించి పిచ్చి మొక్కలను తొలగించి గెస్ట్‌హౌస్‌ను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు వివరించాం

మరమ్మతులకు గురైన రెవెన్యూ గెస్ట్‌హౌస్ అంశాన్ని ఉన్నతాధికారులకు వివరించాం. అవసరమైన నిధులు కేటాయింపు జరిగితే మరమ్మతులు నిర్వహించటం జరుగుతుంది.

– శ్రీనివాసరావు, తహసీల్దార్, రేపల్లె

దేవాలయం అభివృద్ధి ప్రదాత కోనను మరిచిపోవటం సరికాదు

- ఎమ్మెల్యే వేగేశన అందరిన్నీ కలుపుకుని ముందుకుపోవాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు కోకి రాఘవరెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి

బాపట్ల : భావన్నారాయణస్వామి దేవాలయం అభివృద్ధి ప్రదాత, మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతిని రథం తరలించే విషయంలో మరిచిపోవటం సరికాదని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి పేర్కొన్నారు. భావన్నారాయణస్వామి దేవాలయం జీర్ణోద్ధరణకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకురావటంతోపాటు కొత్త రథం నిర్మాణానికి రూ.1.50 కోట్లతో పనులు ప్రారంభించిన కోన రఘుపతి పేరును ప్రస్తావించకపోవటం దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో స్థానిక భావన్నారాయణస్వామి దేవాలయం ఎదుట రథం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ నాయకులు మాట్లాడారు. దేవాలయం జీర్ణోద్ధరణకు కాలికి బలం కట్టుకుని తిరిగి మరీ నిర్మాణానికి అనుమతులు తీసుకువచ్చారని గుర్తు చేశారు. దేవాలయం అంటే అందరి శ్రేయకం ఉండాలని పార్టీలకు అతీతంగా ఇప్పుడు ఉన్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రాజుతోపాటు నాయకులందరి ఇళ్లకు వైఎస్సార్‌సీపీ నాయకులను పంపి మరీ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరినట్లు రాఘవరెడ్డి తెలిపారు. రథం నిర్మాణానికి కూడా రూ.1.50 కోట్లు మంజూరు చేయించటంలో కీలకపాత్ర పోషించిన కోన రఘుపతిని ఇప్పుడు రథం పూర్తయ్యే సందర్భంలో మరిచిపోవటం సరికాదన్నారు.

గాలిగోపురం నిర్మాణం ఎవరు చేశారో తెలుసా: సుధీర్‌బాబు

చరిత్ర కలిగిన భావన్నారాయణస్వామి దేవాలయం గాలిగోపురం కూలిపోతే కనీసం అప్పటి మంత్రులు, కేంద్ర మంత్రులు సైతం పట్టించుకోలేదని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు పేర్కొన్నారు. గాలిగోపురం నిర్మాణానికి కేంద్ర పురావస్తు శాఖను ఒప్పించి మరీ అనుమతులు తీసుకువచ్చిన కోన రఘుపతిని ఇప్పుడు పట్టించుకోకపోవటం ప్రజల నుంచి కూడా వ్యతిరేకత వస్తోందన్నారు.

నేడు బ్రహ్మంగారి తిరునాళ్ల



కర్లపాలెం: మండలంలోని ఏట్రావారిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీమద్ విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి వారి తిరునాళ్ల గురువారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు బుధవారం ప్రకటనలో తెలిపారు. తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు జై వీర బ్రహ్మ జై, గోవింద మాంబ జై అంటూ ఏకనామం జపిస్తామని తెలిపారు. గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి స్వామి వారి మొక్కుబడి జండాలకు నగరోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. తిరునాళ్లలో భాగంగా స్వామి వారి భక్తులు ఆలయం వద్ద విద్యుత్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారని తెలిపారు

లోపాలతో పుట్టిన చిన్నారులపై దృష్టిపెట్టండి

యూనిసెఫ్ ప్రతినిధి డాక్టర్ శ్రీధర్



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీధర్

తెనాలిఅర్బన్: లోపాలతో పుట్టిన చిన్నారులపై అందరూ ప్రత్యేక దృష్టి పెట్టాలని యూనిసెఫ్ ప్రతినిధి డాక్టర్ శ్రీధర్, రాష్ట్రీయ బాల స్వాస్థ్య రాష్ట్ర నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఈ ప్రశాంత్‌లు సూచించారు. ప్రపంచ అటిజం డేను పురస్కరించుకుని ఎర్లి చైల్డ్‌హుడ్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా బుధవారం తెనాలి జిల్లా వైద్యశాలలో వైద్యులు, సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పుట్టుకతో అనేక లోపాలతో చిన్నారులు జన్మిస్తుంటారన్నారు. వారందరికీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన డైక్ సెంటర్‌లలో చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. కొందరు దూర ప్రాంతాలలో నివశిస్తుండటం వల్ల చెప్పిన సమయానికి వైద్యశాలలకు రావటం లేదని, అలాంటి వారిని గుర్తించి వారికి చికిత్స అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అలాగే లోపాలతో జన్మించిన వారు సక్రమంగా మందులు వాడుతున్నారా లేదా అనేది కూడా పరిశీలించాలని సూచించారు. గురువారంతో శిక్షణ ముగుస్తుందని చెప్పా రు. సమావేశంలో డాక్టర్ రాజన్ శుక్లా, జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రోహిణీ రత్నశ్రీ, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, ఎనిమిది జిల్లాల పరిధిలోని ప్రభుత్వ వైద్యశాల పిల్లల వైద్య నిపుణులు, ఎంఎల్‌పీహెచ్‌పీఎస్‌లు, డీసీపీవోలు, ఏఎన్ఎంలు, ఆషాలు పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



తెనాలిఅర్బన్: పట్టణంలో మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. చిట్టి ఆంజనేయ స్వామి దేవస్థానం వద్ద ఉన్న జంపని కాల్వలో జరుగుతున్న పూడికతీత పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ జంపని డ్రెన్‌లో పూడికతీత పనులు చేస్తున్నట్లు చెప్పారు. కాల్వల్లో వ్యర్థాలు వేయటం వల్ల తరచు మురుగు పారుదల నిలచిపోతుందన్నారు. వ్యాపారులు, ప్రజలు చెత్తను కాల్వల్లో వేయకుండా కార్మికులకు అందజేయాలని సూచించారు. ఆమె వెంట వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, టీపీవో సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి హరీష్, పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

నాటక కళనే 'దీపాల' శ్వాసించారు

సంతాప సభలో సినీమాటల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా



దీపాల సుబ్రహ్మణ్యం చిత్రపటం వద్ద కళాకారుల నివాళి

తెనాలి: కళాకారులు, సాంకేతిక నిపుణులతో కలిసి సొంతంగా నాటకసమాజం నిర్వహించిన కళాకారుడు దీపాల సుబ్రహ్మణ్యం నాటక కళలో తెనాలి కీర్తిని ఇనుమడింపజేశారని ప్రముఖ సినీ మాటల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా అన్నారు. ఇటీవల నాటక ప్రదర్శనలో హార్మోనియం వాయిస్తూ కుప్పకూలిపోయి మృతిచెందిన పట్టణానికి చెందిన ప్రముఖ హార్మోనిస్టు, కళాకారుల సంఘ కోశాధికారి శ్రీవిజయలక్ష్మీ శ్రీనివాస నాట్యమండలి పేరుతో నాటక సమాజం వ్యవస్థాపకుడు దీపాల సుబ్రహ్మణ్యం సంతాప సభను బుధవారం పట్టణ రంగస్థల కళాకారుల సంఘ భవనంలో జరిపారు. సంఘం అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి అధ్యక్షత వహించారు. డాక్టర్ సాయిమాధవ్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, జీవించిన ప్రతి మనిషి ఏదోకరోజు మరణించక తప్పదన్నారు. బతికినన్నాళ్లూ సమాజం కోసం తోటిమనుషుల కోసం బతికినవారు జనం హృదయాల్లో చిరంజీవులుగా ఉంటారని చెప్పారు. నాటకరంగ ఉద్ధరణ కోసం కళారంగంలో కొనసాగుతూ తోటి కళాకారులకు జీవనోపాధిని చూపుతూ నంది నాటకోత్సవాల్లో తెనాలికి తొలి నందిని తీసుకొచ్చిన సుబ్రహ్మణ్యం ఆ కోవకు చెందుతారన్నారు. ఆయన నడిచిన బాటలో కళారంగ సేవలో కొనసాగటమే ఆయనకిచ్చే నివాళిగా చెప్పారు. కళాకారుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు గరికపాటి సుబ్బారావు మాట్లాడుతూ దీపాల సుబ్రహ్మణ్యం వ్యక్తిత్వం, గుణగణాలను వెల్లడించారు. సంఘ కార్యదర్శి ఆరాధ్యుల ఆదినారాయణ మాట్లాడుతూ దీపాల సుబ్రహ్మణ్యం హార్మోనిస్టుగా చేసిన కృషిని, ప్రత్యేకతను తెలియజేశారు. కోశాధికారి ఎం.రామలింగేశ్వరుడు పౌరాణిక పద్యనాటకాల్లో సుబ్రహ్మణ్యంతో తనకు గల అనుబంధాన్ని గుర్తుచేశారు. రంగస్థల, సినీనటుడు వేమూరి విజయభాస్కర్, పాతూరి సుబ్రహ్మణ్య కవి, సంఘ సంయుక్త కార్యదర్శి కసపర్తి మధుకర్, పందిటి సుబ్బారావు, లక్ష్మీతులసి, కొండయ్య, ఆర్అండ్‌బీ రాజు, చిట్టూరి సీతారామయ్య మాట్లాడారు. తొలుత సుబ్రహ్మణ్యం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

తెనాలిలో ప్రారంభమైన తైక్వాండో పోటీలు



తెనాలిఅర్బన్: తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో తెనాలి ఇండోర్ స్టేడియంలో బుధవారం ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలను పట్టణ ప్రముఖులు ఈదర వెంకటపూర్ణచంద్, వీరవల్లి మురళీలు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెనాలిలో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలను నిర్వహించటం అభినందనీయమన్నారు. అందరు క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలన్నారు. తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య మాట్లాడుతూ 13 జిల్లాలకు చెందిన 250 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నట్లు చెప్పారు. గురువారం వరకు పోటీలు జరుగుతాయని తెలిపారు. గెలుపొందిన వారు మహారాష్ట్రలో జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాస్, కోచ్ కె.రోహిత్, కె.నాగభూషణం, ముప్పవరపు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం హక్కులను కాలరాసేలా వ్యవహరించటం తగదు

వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్



రేపల్లె రూరల్: ముస్లింల హక్కులను కాలరాసేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ ఆరోపించారు. గుళ్ళపల్లిలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లింలకు తీవ్ర అన్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును తెరపైకి తెచ్చిందన్నారు. ఈ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందితే ముస్లింలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. బిల్లుకు మద్దతు ఇస్తున్నామంటూ జనసేన బహిరంగంగా ప్రకటించటం ముస్లింలకు తీరని అన్యాయం చేయటమేనన్నారు. కేంద్రంలోని బీజేపీతో భాగస్వాములుగా ఉన్న టీడీపీ, జనసేనలు ముస్లింల హక్కులను కాలరాసేలా వ్యవహరిస్తున్నాయన్నారు. బిల్లును పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు పార్లమెంట్‌లో సైతం బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయాలని పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే పిలుపునివ్వటం ముస్లింలకు అండగా నిలవటమేనన్నారు. వైఎస్సార్ కుటుంబం ఆది నుంచి అన్ని సందర్భాలలో ముస్లింలకు అండగా నిలిచిందని చెప్పారు. బిల్లుకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ శక్తి వంచన లేకుండా పోరాడుతుందన్నారు. ముస్లింలు వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఉండాలని కోరారు.

యువత క్రీడల్లో ప్రతిభ కనబరచాలి



క్రికెట్ టోర్నమెంటును ప్రారంభించిన వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఏడుకొండలు

కర్లపాలెం: యువత క్రీడల్లో ప్రతిభ కనబరచాలని కర్లపాలెం మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు తెలిపారు. మండల పరిధిలోని నర్రావారిపాలెం గ్రామంలో కోన ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంటును వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఏడుకొండలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలోని యువత ఆధ్వర్యంలో గత పదేళ్ల నుంచి కోన ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించటం అభినందనీయమన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు మార్పు బెనర్జి మాట్లాడుతూ క్రికెట్ టోర్నమెంటులో మొదటి బహుమతి కోన నిఖిల్, రెండవ బహుమతి మార్పు బెనర్జి, మూడవ బహుమతి యల్లావుల శ్రీనివాసరావు అందజేయనున్నారని తెలిపారు. కార్యక్రమంలో దబ్బుకూటి పృథ్వీరాజ్, యల్లావుల వేణు, అక్కల వెంకయ్య స్వామిరెడ్డి, నంగు రామకృష్ణారెడ్డి, నర్రా మణికంఠ, మరకా భద్రీ, అక్కల శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

ఆసుపత్రి అభివృద్ధికి ప్రభుత్వ సహకారం ఉంటుంది

ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

వేమూరు: సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి ప్రభుత్వ సహకారం పూర్తిగా ఉంటుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు నిర్లక్ష్యం చేయకుండా పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలని సూచించారు. వైద్యుల కొరత ఉంటే తన దృష్టికి తీసుకొని రావలెనాని తెలిపారు. రోగులకు మందుల కొరత లేకుండా చూడాలన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి కమిటీ సహకారం పూర్తిగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సయ్యద్ జారీన్ పర్వాన్, గ్రామ సర్పంచ్ సజ్జా లక్ష్మీ తిరుపతమ్మ, జొన్నలగడ్డ విజయబాబు, వేల్పుల రవి ప్రసాద్, గొట్టిపాటి నరహరి ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై నిజాలు బయటకు తీయాలి

తెనాలిలో శాంతి ర్యాలీ



శాంతి ర్యాలీలో పాల్గొన్న పాస్టర్‌లు, క్రైస్తవులు

తెనాలిఅర్బన్: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి నిరసనగా బుధవారం తెనాలి పట్టణంలో పాస్టర్‌లు, క్రైస్తవులు, మహిళలు పెద్దసంఖ్యలో కదం తొక్కారు. పట్టణంలోని ప్రధాన రహదారులలో ప్రదర్శన చేపట్టారు. పాస్టర్ ప్రవీణ్ మృతిలోని మిస్టరీని చేధించి ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. హైద్రాబాద్‌కు చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి నిరసగా తెనాలి టౌన్ పాస్టర్స్, మండల పాస్టర్స్ అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. చెంచుపేటలోని ఉమేష్ చంద్ర విగ్రహం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఓవర్ బ్రిడ్జి, ఆషా థియేటర్ రోడ్డు మీదుగా సాయిబాబా గుడి వద్దకు చేరుకుంది.

అక్కడి నుంచి ప్రకాశం రోడ్డు, రజక చెరువు, గాంధీ చౌక్, బోసురోడ్డుల మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయంకు చేరుకుంది. ఈ సందర్భంగా పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ అనుమానాస్పదంగా మృతి చెందారని గుర్తు చేశారు. పాస్టర్ ప్రవీణ్ మృతికి కారణాలు వెంటనే తెలియజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ సంజనా సింహకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో తెనాలి టౌన్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ కూచిపూడి అబ్రహం, తెనాలి మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రెవరెండ్ ఎ.భానుప్రసాద్, నాయకులు బిషప్ కత్తెర సుధీర్ కుమార్, బిషప్ జె.ప్రభుదాసు, బిషప్ పినపాటి జాన్‌పాల్, బిషప్ పాముల పరంజ్యోతి, పల్లె సామ్యూల్, బ్రదర్ సాల్మన్, బ్రదర్ రావూరి విక్టర్ పాల్, రెవరెండ్ మార్టిన్ లూథర్ బాబు, బ్రదర్ ఆనందన్న, బ్రదర్ రెడ్డిబోయిన అబ్రహం, రెవరెండ్ మార్పు స్టీఫెన్, పాస్టర్‌లు మల్లవరపు విజయ్ కుమార్, పినపాటి గంగారావు, డి యేసురత్నం, వై లెనస్ బాబు, తెనాలి డేవిడ్, సర్వోన్నతరావు, సువర్ణరాజు, డీసీ థామస్, నందివెలుగు రమేష్, పినపాటి స్టీవెన్ బాబు, కారుమూరి ఐక్రయ్య, ఎం ప్రభుదాస్, కటెవరపు జాన్‌బాబు, క్రైస్తవులు కటెవరపు దేవానంద్, అక్కిదాసు కిరణ్ కుమార్, మట్లపూడి రాజేశ్వరరావు, పినపాటి సురేష్ బాబు, తమనం భూషణం, పెద్ద సంఖ్యలో క్రైస్తవులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

అలరించిన 'శశిరేఖా పరిణయం'



'ది లెసన్' నాటికలో సన్నివేశం

తెనాలి: డీఎల్ కాంతారావు పోస్టల్ ఉద్యోగుల కళాపరిషత్ జాతీయస్థాయి నాటకోత్సవాల్లో రెండోరోజైన బుధవారం రాత్రి ప్రదర్శించిన పౌరాణిక పద్యనాటకం ప్రేక్షకులను అలరించింది. శ్రీసాయి కళానికేతన్ వెల్ఫేర్ సొసైటీ, విశాఖపట్నం వారి పౌరాణిక పద్యనాటకం 'శశిరేఖా పరిణయం' (మాయాబజార్)ను ప్రదర్శించారు. శ్రీకృష్ణుడుగా విజయసాయి నటించగా, శశిరేఖ పాత్రలో కుమారి, అభిమన్యుగా జీఎల్.నాయుడు, ఘటోత్కచుడుగా విజయసారధి నటించారు. పాండవులు, కౌరవుల సంవాదం, మాయాబజారును సృష్టించి కౌరవులను ఆహ్వానించటం, అభిమన్యు, శశిరేఖల పరిణయం, ఇందుకు ఘటోత్కచుడు పన్నిన మాయా వ్యూహాలు ప్రేక్షకులను రంజింపజేశాయి. విద్వాన్ కన్నశ్రీ రచించిన నాటకాన్ని బీవీఏ నాయుడు దర్శకత్వంలో ప్రదర్శించారు. పౌరాణికపద్యనాటకానికి ముందుగా డీఎల్ కాంతారావు పోస్టల్ ఉద్యోగుల కళాపరిషత్, తెనాలి వారి 'ది లెసన్' సాంఘిక నాటికను ప్రదర్శించారు. అతి గారాబంగా పెరిగిన కొడుకు దుర్వ్యసనాలకు లోనై తాగుడుకు డబ్బివ్వలేదని కన్నతల్లినే కడతేరుస్తాడు. ఈ నేరానికి గాను కొడుక్కి ఉరిశిక్ష పడుతుంది. మంచితనం, మానవత్వం అనే పాఠాలను పూర్తిగా చదువుకుని, ఇతరులకు అందించమని సందేశమే 'ది లెసన్' నాటిక సారాంశం. నటీనటులు పాత్రోచితంగా నటించారు. ప్రధాన పాత్రల్లో పీఎస్సార్ బ్రహ్మాచార్యులు, బి.మోహనరావు, ఎస్.రమేష్, జి.వసంతయామిని నటించారు. స్నిగ్ధ రచించిన ఈ నాటికను పీఎస్సార్ బ్రహ్మాచార్యులు దర్శకత్వంలో ప్రదర్శించారు. సంగీతం కేవీ రమణ, ఆహార్యం పి.శేషగిరిరావు, రంగాలంకరణ పి.వెంకటరావు. తొలుత ప్రముఖ న్యాయవాది వెలినేని రాఘవయ్య జ్యోతిప్రజ్వలన చేశారు. కళాపరిషత్ అధ్యక్షుడు డీఎల్ కాంతారావు పర్యవేక్షించారు.